క్లుప్తంగా

ముస్లిం, మైనార్టీలకు సహాయపడాలి

నున్న(విజయవాడరూరల్): పేదముస్లిం, మైనార్టీలకు సహాయపడటమే ఆజాద్ కమిటీ ప్రధాన ఆశయమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. నున్న గ్రామంలో గన్నవరం నియోజకవర్గం ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. నాగుల్ మీరా మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బిల్డర్ నాగుల్‌మీరా పేదలకు చేస్తున్న సేవలను అభినందించారు. బిల్డర్ నాగుల్‌ను రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షునిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సయ్యద్ మస్తాన్‌వలీగౌస్, సహాయ కార్యదర్శి సుభాని, నున్న అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్‌బాషా, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటర్ల ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు

గన్నవరం: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 2, 3 తేదీల్లో ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి బీ చంద్రలీల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడరూరల్ మండలాల్లోని 306 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాపులపాడులో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని శుక్రవారం తెలిపారు. మండలంలో 15,718 ఎకరాల్లో వరి పంట సాగు చేశారని, తద్వారా సుమారు 46,855 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు ఆమె చెప్పారు. ఇప్పటికే వరి కోతలు ఊపు అందుకోవడంతో ఆర్బీకేల్లో దాదాపు 1.23 లక్షల గన్ని బ్యాగ్స్ అందుబాటులో ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. రైతులు ఆర్బీకేల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కంకిపాడు: గొడవర్రు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఎం.ఫణీశ్వరరావు, ఎం.రాజేంద్రప్రసాద్ కుటుంబాలకు గ్రామస్తుడు, కాకినాడ నివాసి యలమంచిలి ఉమామహేశ్వరరావు రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సాయాన్ని ఎంపీటీసీ సభ్యురాలు చుండూరు నిర్మలజ్యోతి బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో చుండూరు మోహన్‌రావు, మాచర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో అమ్మవారికి గాజుల అలంకరణ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా గాజుల అలంకరణ చేశారు. గ్రామంలో కార్తిక మాసం శుక్రవారం సందర్భంగా భక్తులు వివిధ రకాల గాజులు తీసుకువచ్చి అమ్మవారిని అలంకరించారు. ఆలయ పూజారి ఎస్.కోటేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో యువీ.ప్రసాదరావు పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వడంతో పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన పఠాన్‌నాగూర్‌బీ భర్త సైదా కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె బట్టల షాపులకు సంబంధించిన ప్రకటన కరపత్రాలు పంచే ఉద్యోగం చేస్తోంది. గురువారం ఆమె పోరంకిలో కరపత్రాలు పంచి బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపుకు వెళుతున్న బైక్ ఢీ కొట్టింది. ఘటనలో ఆమె రోడ్డుపై పడిపోయింది. ఆమె పైకి లేస్తున్న సమయంలో కారు వచ్చి మరల ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రంగా గాయాలు అవ్వడంతో విజయవాడలో ఆస్పత్రిలో చేర్చారు.

పొలం బడి క్షేత్ర దినోత్సవం

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పొలం బడి క్షేత్ర దినోత్సవం శుక్రవారం జరిగింది. పొలం పరిసరాల విశ్లేషణ, భాగస్వామ్య కార్యాచరణ ప్రణాళిక వంటి పద్ధతులు వల్ల కలిగే ప్రయోజనాలను ఏవో ఎస్ఎల్ తేజస్వి వివరించారు. రైతులు మాదల సాంబశివరావు, కొమ్మినేని లక్ష్మణరావు, ఉపసర్పంచ్ కుంటముక్కల శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కడదాం...



ఇందుపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సరోజిని, మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి

ఉంగుటూరు: ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కడదామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్ మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎంపీపీ సరోజిని మాట్లాడుతూ పేదల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా పథకాలను అందజేస్తున్నారని చెప్పారు. ఇందుపల్లిలో గత నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వ పథకాల ద్వారా రూ. 20.97కోట్లు లబ్ధి చేకూరిందని ఎంపీడీవో శేషగిరిరావు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కూరాకుల వెంకట్రామయ్య, మండల జేఎస్‌సీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి(నాని), ఈవోపీఆర్డీ అమీర్‌బాషా, నాయకులు గుడిసే బాలస్వామి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

పోరంకిలో....



పోరంకిలో సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి, నేతలు

పెనమలూరు: పోరంకి సచివాలయం-3 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి ప్రసంగించారు. సచివాలయం-3లో ఇప్పటి వరకు రూ. 21.24 కోట్లు లబ్ధిదారులకు ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చుండూరు శేఖర్‌బాబు, నల్లమోతు జీవన్, ఆకునూరు సుబ్బారావు, చలమల జోజికుమార్, వేమూరి బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్దవరంలో....

బుద్దవరం(గన్నవరం): మండలంలోని బుద్దవరం గ్రామ సచివాలయం-1లో 'వై ఏపీ నీడ్స్‌జగన్' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, సర్పంచ్ బడుగు బాలమ్మ, ఉపసర్పంచ్ వేల్పూరి బసవరావు ఆవిష్కరించారు. పార్టీ జెండాను పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ ఎగురవేశారు. ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు నక్క కృష్ణయ్య, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మంతెన గ్రామంలో...

కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ పాలనపై సమీక్షించారు. సచివాలయ ప్రాంగణంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, ఈడ కూర్మారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బుద్దవరంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉప్పలూరులో అగ్ని ప్రమాదం



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మండలంలోని ఉప్పలూరులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఇట్టా బోడియ్య పశువుల పాకకు శుక్రవారం మధ్యాహ్నం నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. పాకలో కట్టేసిన రెండు పాడి పశువులు, ఒక దూడకు మంటలు అంటుకోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పే యత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. గన్నవరం అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హుటాహుటిన గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పశువైద్య సిబ్బందిని ఘటనాస్థలానికి పిలిపించి పశువులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. పశువైద్యానికి గానూ బాధిత కుటుంబానికి రూ 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నెరుసు సతీష్, మాగంటి శ్రీనివాసరావు, సురేష్, నిమ్మకూరు రామారావు, నెరుసు నాని ఎమ్మెల్యేతోపాటు ఉన్నారు.

రైతులకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీమోహన్

రామవరప్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో రైతు బజారు ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ. 1.7 కోట్ల వ్యయంతో 70కు పైగా షాపులతో జాతీయ రహదారికి సమీపంలో రైతు బజారును అతిత్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతుల అభివృద్ధికి సీఎం జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి దోహదపడుతున్నారని పేర్కొన్నారు. రైతుభరోసా, సున్నావడ్డీ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, రైతుభరోసా కేంద్రాలు వంటి పథకాలు నియోజకవర్గంలో దిగ్విజయంగా అమలౌవుతున్నాయని చెప్పారు. గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతు బజారు ఏర్పాటుతో కరెన్సీనగర్‌తో పాటు రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో గన్నవరం మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంజనీకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, రైతు సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



బైక్ ర్యాలీ చేస్తున్న ఆర్డీఓ రాజు, సిబ్బంది

పెనమలూరు: ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకుని ఓటరుగా మారాలని ఆర్డీఓ డి.రాజు అన్నారు. కానూరులో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఆర్డీఓ రాజు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు సంక్రమిస్తుందని చెప్పారు. ఓటు హక్కు ఉంటే ఎన్నికల్లో సరైన నాయకుడిని ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుందని ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమని తెలిపారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య మాట్లాడుతూ శని, ఆదివారాల్లో బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించాలన్నారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లోని బీఎల్‌వోలు విధిగా పోలింగ్ కేంద్రాల వద్ద హాజరవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, మున్సిపాలిటీ కమిషనర్లు, రెవెన్యూ, మున్సిపల్, సచివాలయం సిబ్బంది, బీఎల్‌వోలు ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు గ్రామానికి చెందిన మహిళ 2011 సంవత్సరంలో శ్రీకర్‌ను వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే భర్తతో విభేదాల కారణంగా ఆమె అదే గ్రామంలో వేరుగా ఉంటోంది. కాగా ఆమెకి గత 5 సంవత్సరాలుగా మరీదు గోపీకృష్ణ, అతని భార్యతో పరిచయముంది. గోపీకృష్ణ కామయ్య తోపులో ఫొటో స్టూడియో నడుపుతాడు. అతని స్టూడియో వెనుక ఉన్న రూం ఆమెకి ఇవ్వగా అందులో ఆమె బ్యూటీపార్లర్ పెట్టింది. తర్వాత గోపీకృష్ణ ప్రవర్తన నచ్చక ఆమె షాపును చోడవరం రోడ్డులోకి మార్చింది. అప్పటి నుంచి గోపీకృష్ణ ఆమెని వేధిస్తూ ఫేస్‌బుక్‌లో అసభ్య పోస్టులు పెట్టసాగాడు. దీంతో ఆమె నిలదీయగా గోపీకృష్ణ, అతని భార్య దాడి చేశారు. అంతటితో ఆగక చంపుతానని బెదిరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వ్యక్తి పై కేసు

పెనమలూరు: అపార్టుమెంట్ వద్ద జరిగిన వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మహదేవపురంకాలనీ వద్ద సాయిరెసిడెన్సీలో ఎస్.సుబ్బారావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని అల్లుడు అప్పారావు కూడా వారితోనే ఉంటున్నాడు. అయితే అప్పారావు తన బైక్‌ను కడిగి లోపల పెడుతుండగా అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న సాగర్ వచ్చి గొడవపడి దాడి చేశాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కంకిపాడు: మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 5 లక్షలు అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం చేపట్టారు. రోడ్డు పనులను సర్పంచ్ పెద్దు వరప్రసాద్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు జడా రవి, మాజీ సర్పంచ్ డేవిడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేకువ జామునే అందిన పింఛన్‌లు

పెనమలూరు: మండల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక శుక్రవారం వేకువ జామునే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెనమలూరు మండల పరిధిలో 5745 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 1,58,91,250, తాడిగడప మున్సిపాలిటీలో 12,818 మంది లబ్ధిదారులకు రూ. 3,58,01,250 చొప్పున పింఛన్ సొమ్ము ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో శుక్రవారం వేకువజామునే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు.

విజయవాడ రూరల్ మండలంలో ....

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 13836 మందికి రూ. 3,84,87,000 పింఛను పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలియజేశారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తగరం మోహనరావు అనే లబ్ధిదారునికి వలంటీరు పావని ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

ఉంగుటూరులో...

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా ఉన్న 27 గ్రామ పంచాయితీల్లో 8197 మంది లబ్ధిదారులకు రూ.2.21కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 80శాతం పంపిణీ చేశారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ పథకాలు



గన్నవరం రూరల్: పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు చైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. మండలంలోని సూరంపల్లి పాలకేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పల్లెకు పోదాం, పాడిని చూద్దాం కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు అందజేస్తున్న సేవలను సమీక్షించారు. పాడి రైతులకు లబ్ధి చేకూర్చే స్కీంలు అందుబాటులో ఉంచామని, పాడి పెంపుదలే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ మేనేజర్ కోటా ప్రసాద్, డైరెక్టర్ పలగాని కొండలరావు, పాలకేంద్రం అధ్యక్షుడు ఈలప్రోలు రాంబాబు, వేతన కార్యదర్శి చిట్టినేని జోజిబాబు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో టెండర్ల స్వీకరణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరగనున్న సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పలు వస్తువులు సరఫరా చేసేందుకు దేవాదాయ శాఖాధికారి కెవి.అనురాధ సమక్షంలో శుక్రవారం సీల్డ్ టెండర్లు స్వీకరించారు. అనంతరం టెండర్‌దార్ల సమక్షంలో వచ్చిన సీల్డ్ టెండర్లను ఓపెన్ చేసి తక్కువ కోట్ చేసిన అభ్యర్థుల పేర్లను తెలిపారు. ఆలయ ఈవో పి.లోకేశ్వరి మాట్లాడుతూ ఆలయంలో నిర్వహించే సంక్రాంతి-2024 ఉత్సవాలకు సంబంధించి వివిధ పనులు గ్రామోత్సవానికి సన్నాయి వాయించుటకు చాగంటిపాటి కల్యాణ్, డప్పులు చిన రోశయ్య, తీన్మార్ ప్రకాష్‌బాబు, తెప్ప ఏర్పాటుకు ఎం.సహదేవుడు, భోజనాలు సప్‌లై చేసేవారిని ఏర్పాటు చేయడానికి సూరిబాబు, అమ్మవారి రథం లైటింగ్‌కు కిరణ్‌కుమార్, షామియానాకు నవీన్‌కుమార్‌లు తక్కువ మొత్తంలో సీల్డ్ టెండర్లు సమర్పించారని వెల్లడించారు. ఈ జాబితా తుది నిర్ణయానికి దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్టుపై సదస్సు

గన్నవరంరూరల్: అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్టుతో ప్రాణాలు రక్షించాలని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు వైద్యులకు సూచించారు. కళాశాలలో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్టుపై పీజీ, ఎంబీబీఎస్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు రోగి యొక్క పరిస్థితిని వేగంగా, ఖచ్చితంగా అంచనా వేయడంలో ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మణిపాల్ అకాడమి హయ్యర్ ఎడ్యుకేషన్‌కు చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విమల్‌కృష్ణన్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

సూక్ష్మ కళ.. భళా..

- మైక్రో ఆర్ట్‌తో గుర్తింపు పొందుతున్న యనమలకుదురువాసి సుజాత
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు
- బల్లి గుడ్డు, ఉసిరి ఆకు, టూత్‌పిక్‌లపై ఆర్ట్



కొబ్బరికాయతో పూరి జగన్నాథుని ఆలయం నమూనా



సుజాత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటి పనులు పూర్తయిన తర్వాత ఖాళీ దొరికితే చాలు.. టీవీ సీరియల్స్ చూస్తే కాలక్షేపం చేయకుండా కాస్త భిన్నంగా ఆలోచించి సూక్ష్మ కళపై దృష్టిపెట్టారు యనమలకుదురుకు చెందిన 55 ఏళ్ల నడకుదిటి సుజాత. కళాత్మక దృష్టితో పెన్సిల్ మొనతో మంచి ఆకృతులను తయారుచేస్తున్నారు. నిత్యం పత్రికలు చదువుతూ వాటిలో మైక్రో ఆర్ట్‌పై వచ్చిన కథనాలను చదివి తాను కూడా ఇలా ఎందుకు చేయకూడదు అనే ఆలోచన సుమారు ఏడేళ్ల క్రితం వచ్చింది. ఆమె వెంటనే దానిని ఆచరణలో పెట్టారు. ఉసిరి చెట్టు ఆకులపై అక్షరాలు, కోడి, వివిధ పక్షులు పెట్టే గుడ్లపై వివిధ రకాల బొమ్మలు వేస్తూ స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, వివిధ పండుగలు, క్రికెట్ మ్యాచ్‌లు ఇలా సందర్భాన్ని బట్టి కోడి గుడ్లపై బొమ్మలు గీయడం సుజాతకు అలవాటుగా మారింది. పాత నాణేల సేకరణ, కరెన్సీ నోట్లపై ఉన్న నంబర్లలో బంధువులు, స్నేహితుల పుట్టిన రోజు, పెళ్లి రోజులను గుర్తించి వాటిని సుజాత బహుమతిగా వారికి అందజేస్తుంటారు. ఈ వైవిధ్యమైన కళను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గుర్తించి ఈ ఏడాది ఆగస్టులో సుజాత పేరుతో రికార్డ్ నమోదు చేసుకుని గుర్తింపు పత్రాన్ని అందజేశారు.

ఘనంగా ఎస్సార్కే కళాశాలలో స్వాగతోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు స్వాగతోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కళాశాలలో అడుగు పెట్టిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు సలహాలు, సూచనలిస్తూ వారి అభివృద్ధికి దోహదపడాలన్నారు. కళాశాలలో ర్యాగింగ్ నిషేధమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి కృష్ణయ్య, ఏట ప్రతాప్, ప్లేస్‌మెంట్ అధికారి నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



గన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

రామవరప్పాడు: ఎయిడ్స్ రహిత సమాజం నిర్మాణానికి కృషి చేయడానికి యువత ముందుకు రావాలని విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో విజయ ఫార్మసీ కళాశాల, ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్, జాతీయ సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉషారామ కళాశాల ఆధ్వర్యంలో...

ఉంగుటూరు: అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో పొట్టిపాడులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరంలో ...

గన్నవరం: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకుసాగాలని ఐసీటీసీ కౌన్సిలర్ పి.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం ఐసీటీసీ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుండి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు ఆరోగ్యం, ఆహారం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. లింక్ వర్కర్లు ఎం.సదాలక్ష్మీ, కరుణ, కిషోర్, ఎంజేఎం కాలేజ్, తమ్మినేని నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కానూరులో....

పెనమలూరు: క్రమశిక్షణతో జీవిస్తే ఎయిడ్స్ నివారించవచ్చని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కానూరులో విద్యార్థులు అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన తీసుకొస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఎయిర్‌పోర్ట్ వద్ద టీడీపీ నేతల హల్‌చల్

గన్నవరం: నారా చంద్రబాబునాయుడు గన్నవరం విమానాశ్రయానికి విచ్చేస్తున్న సందర్భంగా శుక్రవారం టీడీపీ నేతలు హల్‌చల్ చేశారు. చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు ముందుగానే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. వీరందరూ అరుపులు, కేకలతో కొద్దిసేపు టెర్మినల్ వద్ద హల్‌చల్ చేశారు. బైక్‌లను రోడ్డుకు అడ్డంగా పెట్టి హారన్లు మోగిస్తూ, బైక్ విన్యాసాలతో స్వైరవిహారం చేశారు. పోలీసులు పలుమార్లు హెచ్చరించినప్పటికి టీడీపీ నేతలు లెక్కలేని విధంగా ప్రవర్తించారు. దీంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

చంద్రబాబుకు టీడీపీ శ్రేణుల స్వాగతం



ప్రసాదంపాడులో నారా చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

రామవరప్పాడు: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు రూరల్ మండలంలో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. తిరుపతి నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు అక్కడ నుంచి ఉండవల్లిలోని తన నివాసానికి బయలు దేరారు. ఆయన కాన్వాయ్‌తో పాటు గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన శ్రేణులు ర్యాలీగా అనుసరించారు. నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు మీదుగా ఉండవల్లి చేరుకున్నారు.